పెళ్ళి ముహూర్తాని కొచ్చిన పేరంటాల వాళ్ళలా ఉదయం కాఫీ టిఫిన్లు ముగించుకొచ్చారు కూతుళ్ళు. తల్లి మెడలో పచ్చలపేరు కన్పించడం లేదు. నిశ్చేష్టులైపోయారు. దవడ కండరాలు బిగుసుకు పోయినై.

"పచ్చల పేరేమైందమ్మా?" అడిగారు కోరస్‌గా,

పేగు చించుకు పుట్టిన బిడ్డలకు పెంచి పోషించిన తల్లికంటే పచ్చలపేరే ఎక్కువైందన్నమాట. పార్వతమ్మ పెదాల మీద నిర్జీవమైన నవ్వు మెరిసి మాయమైంది.

"చెప్పమ్మా ! పచ్చల పేరేమైందీ ? రెట్టించింది జానకి.

"చెప్పవే ... పచ్చల పేరైమైందే !" అసహనంతో ఊగిపోతుంది సుకుమారి.

ఇద్దరి మొహాలను పరీక్షగా చూచి "ప్చ్ పోయింది !" అంటూ పెదాలు చప్పరించింది పార్వతమ్మ.

వెంటనే పోలీసు రిపోర్టిచ్చారు అల్లుళ్ళు. మార్వాడీ వద్ద పోలీసుల చేతికి చిక్కిందా పేరు.

"నీకిది ఎవరమ్మారూ !" అడిగాడు యస్సై మార్వాడీని. జిల్లా యస్పీకా మార్వాడి దగ్గిరి చుట్టం. "అదంతా మీకెందుకు ఫో" అన్నాడతడు.

వెంటనే పనిమనిషి మంగి కళ్ళలో కదలాడింది. ఇంతవరకొచ్చింది.

కనకాంబరం కళ్ళల్లో రఘురామిచ్చిన యాభై కాగితం కదలాడింది. విశ్వాసం గల కుక్కలా చూశాడతనివైపు. సైగ దొరికింది. నరాల్లో కర్తం పౌరుషమై పొంగింది.

"ఏయ్ మంంగీ ! తలుపు తియ్యవేమే ! నాకే టోక్రా యిస్తవా ?" బలంగా తన్నాడు తాటాకుల తలుపును. దరిద్రుడి కోపంలా కుప్ప కూలిందది. అంతా లోపలికెళ్ళారు.

చీరకట్టుకుంటున్న మంగి సిగ్గుతో కుంచించుకు పోయింది. ఇద న్యాయమని అరిచింది. నాకేమీ తెలియదని మొత్తుకుంది.

బరబరా లాకెళ్ళారు స్టేషనుకు. మంగి లబలబ మొత్తుకుంటూనే ఉంది.

యస్సై లాఠీ మంగి వీపు మీద వీరవిహారం చేసింది. "నీ యమ్మ... నీ కండ్లకు కావురమెక్కినాదే ! పాపమన్న పార్వతమ్మకే టోపి వేస్తావే పోరీ !" తిట్ల పురాణం సాగుతూనే ఉంది. మంగి విలవిల్లాడిపోతుంది.

